క్లుప్తంగా

హెచ్‌సీఏకు సుకుమార్ ఎంపిక



వరంగల్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిర్వహించనున్న పోటీలకు వరంగల్ కాశిబుగ్గకు చెందిన ఓని సుకుమార్ ఎంపికయ్యాడు. హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీఎస్ సుకాంత్ క్రికెట్ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ -14 క్రికెట్ పోటీల్లో సుకుమార్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతడిని డీవైఎస్‌ఓ సత్యవాణి, వరంగల్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, కోచ్ వై.సుమన్, స్నేహితులు అభినందించారు.

పారా తైక్వాండో స్వర్ణ పతక విజేతకు అభినందనలు



వరంగల్: గతనెల బహ్రెయిన్ దేశంలో నిర్వహించిన అంతర్జాతీయ పారా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో వరంగల్ జిల్లా పైడిపల్లికి చెందిన ఎల్లావుల గౌతమ్‌యాదవ్ పాల్గొని స్వర్ణ పతకం సాధించాడు. జిల్లాకు ఆదివారం వచ్చిన సందర్భంగా అభిమానులు పెద్దఎత్తున హనుమకొండ నుంచి పైడిపల్లికి అభినందన ర్యాలీ నిర్వహించారు. పోచమ్మమైదాన్‌కు ర్యాలీ చేరుకోగా గౌతమ్‌యాదవ్‌ను మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, నన్నపునేని నరేందర్ సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు కైలాష్‌యాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు ఎల్లావుల కుమార్‌యాదవ్, కేతిరి రాజశేఖర్, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా ప్రభాకర్‌రెడ్డి



న్యూశాయంపేట: సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శిగా గాదె ప్రభాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. హసన్‌పర్తిలో జరిగిన జిల్లా 2వ మహాసభల్లో ఆయనను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర, జిల్లా నాయకులు, పలు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

రేపు పాన్‌షాపుల బంద్

హన్మకొండ అర్బన్: జిల్లాలోని పాన్‌షాపులు మంగళవారం బంద్ నిర్వహించనున్నట్లు హనుమకొండ పాన్ మర్చంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగ కుమారస్వామి యాదవ్, ఎస్.సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని లష్కర్‌బజార్‌లోని శ్రీలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు సంఘం సర్వ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాన్ ధరల సవరణ, నూతన కమిటీ ఎన్నిక, సభ్యత్వ నమోదు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం సభ్యులందరూ సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

అనాథాశ్రమంలో దుప్పట్ల పంపిణీ



హన్మకొండ అర్బన్ / కాజీపేట అర్బన్: వడ్డపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలోని పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు మండల సంధ్య, సమ్మయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి - నీలిమారెడ్డి దంపతులు పాల్గొని దుప్పట్లు అందజేశారు. తాళ్లపెల్లి సుధాకర్, ఎనుకోటి పున్నం, మేరీ, రాజేశ్వర్‌రావు, అక్మల్ పాషా, శివ, స్నిగ్ధ, తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ రిటైర్డ్ అసిస్టెంట్ మృతి


కొండల్‌రెడ్డి (ఫైల్)

కేయూ క్యాంపస్: కేయూ లైబ్రరీ రిటైర్డ్ అసిస్టెంట్ పి.కొండల్‌రెడ్డి శనివారం సాయంత్రం మృతిచెందారు. హనుమకొండలోని కేయూ ఎంప్లాయీస్ కాలనీకి చెందిన కొండల్‌రెడ్డి (66) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కొండల్ రెడ్డి మృతిపై కేయూ నాన్‌టీచింగ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు సంతాపం తెలిపారు.

'బీజేపీతోనే నగరాభివృద్ధి'

ఖిలా వరంగల్: బీజేపీతోనే నగరాభివృద్ధి జరుగుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి కర్నె రవీందర్ అన్నారు. వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్, ఏకశిలనగర్, లక్ష్మీనగర్, గుండు బావుల ప్రాంతాల్లో డివిజన్ అధ్యక్షుడు బోరిగం నాగరాజు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

చదువుకు సమ్మె ఎఫెక్ట్

విధులకు దూరంగా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు

- మినిమం పేస్కేల్ వర్తింపజేయాలని డిమాండ్
- విద్యాశాఖలో నిలిచిన పనులు
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వేడుకోలు


హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు


గతేడాది సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నాలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యాశాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె కొనసాగుతుండటంతో కేజీబీవీల్లో విద్యాబోధన అంతంత మాత్రమే కొనసాగుతుండగా పలు విభాగాల్లోని పనులు నిలిచిపోయాయి. సుమారు 18 ఏళ్లుగా సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ ఉద్యోగులు 9 విభాగాల్లో పనిచేస్తున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు, ఆందోళనలు చేశారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా.. తమను రెగ్యులరైజ్ చేయడం లేదని, ఉద్యోగులందరికీ మినిమం పేస్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం బాధ్యులు వాపోతున్నారు.

నిలిచిన 'యూడైస్'

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో యూడైస్ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆఫ్ ఎడ్యుకేషన్) పనులు నిలిచిపోయాయి. ఆయా పనులు నిర్వహించాల్సిన సిబ్బంది సమ్మె చేస్తుండటంతో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ నిలిచిపోయింది. బడిబయట విద్యార్థుల సర్వేను ఈ నెల 12 నుంచి నిర్వహించాల్సి ఉండగా సీఆర్‌పీల సమ్మెతో అది కూడా నిలిచిపోయింది. డీఈఓ కార్యాలయాల్లో ఎంఎస్‌ఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏపీఓలు సమ్మెలో పాల్గొంటుండటంతో పలు రకాల పనులు నిలిచిపోయాయి. మండల కేంద్రాల్లో సీఆర్‌పీలు సమ్మెలో భాగస్వాములు కావడంతో ఎంఈఓలు ఇబ్బందులు పడుతున్నారు.

కొనసాగుతున్న సమ్మె..

హనుమకొండ,వరంగల్,జనగామ,ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెను కొనసాగిస్తున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద నిరసన దీక్షలు కొనసాగిస్తుండగా మిగతా జిల్లా కేంద్రాల్లో ఆయా ఉద్యోగులు సమ్మె చేస్తూ దీక్షలు కొనసాగిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వారీగా ఉద్యోగుల సంఖ్య

హనుమకొండ	418
వరంగల్	473
ములుగు	332
మహబూబాబాద్	567
జేఎస్ భూపాలపల్లి	403
జనగామ	452

విద్యాబోధనకు ఆటంకం..

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో ప్రధానంగా కేజీబీవీల్లో విద్యాబోధనకు ఆటంకం ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీలో కనీసం15 మంది వరకు సమగ్ర శిక్ష ఉద్యోగులు పనిచేస్తున్నారు. అందులో ఉద్యోగులతో పాటు నాన్ టీచింగ్ ఉద్యోగులు కూడా సమ్మెలో భాగస్వాములు అవుతున్నారు. వివిధ జిల్లాల్లోని ఎంఈఓలను ఆయా కేజీబీవీల నిర్వహణ బాధ్యతల పర్యవేక్షణను అప్పగించారని సమాచారం. పైగా పాఠాలు కూడా బోధించాలని పలు జిల్లాల డీఈఓలకు మౌఖికంగా ఆదేశించారని సమాచారం. అవసరం మేరకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించినట్లు సమాచారం.

హామీని నిలబెట్టుకోవాలి



18 ఏళ్లుగా తొమ్మిది విభాగాల్లో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నాం. మినిమం పేస్కేల్ వర్తింపజేసి రెగ్యులరైజ్ చేయాలి. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు సమ్మె చేస్తాం. అవసరమైతే ఆమరణ దీక్షలకు కూడా దిగుతాం. రాష్ట్రవ్యాప్తంగా 19,325 మంది ఉద్యోగులు సమ్మెలో భాగస్వాములు అవుతున్నారు.

– దొనికల శ్రీధర్‌గౌడ్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు

ఉక్కు మనిషి 'పటేల్'కు ఘన నివాళి


హన్మకొండ చౌరస్తా: పటేల్ చిత్రపటానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే నాయిని, నాయకులు


వరంగల్ వెంకట్రామ జంక్షన్‌లో..

హన్మకొండ చౌరస్తా: దేశ మొదటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వర్ధంతిని హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ దేశాన్ని ఐక్యం చేసి, సమైక్య స్ఫూర్తిని నింపిన ఉక్కు మనిషి వల్లాభ్‌భాయ్ పటేల్ అని కొనియాడారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, నాయిని లక్ష్మారెడ్డి, బంక సరళ, గుంటి స్వప్న, కుమార్‌యాదవ్, సంపత్, నాగరాజు, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వెంకట్రామ జంక్షన్‌లో..

వరంగల్ చౌరస్తా: మాజీ ఉప ప్రధాని వల్లబ్‌భాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా వరంగల్ వెంకట్రామ జంక్షన్‌లో ఆయన విగ్రహానికి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సంస్థానాలను విలీన చేసిన ఘనత పటేల్‌దని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, నాయకులు పోలెపాక యాకూబ్, ఓడపల్లి రవి, శ్యామల, ఒంటెద్దుల శ్రీకాంత్, భిక్షపతి, కుమారస్వామి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలకు సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ అర్బన్: హనుమకొండ రెడ్‌క్రాస్ కార్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్న కార్యాలయానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ అభ్యున్నతికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. రెడ్‌క్రాస్ ముందు ఉన్న రహదారికి రెడ్‌క్రాస్ రోడ్డుగా పేరు మార్చాలని పాలకమండలి చేసిన ప్రతిపాదన అమలుకోసం కృషి చేస్తామన్నారు. తలసేమియా విషయంలో రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమని కొనియాడారు. వారికి త్వరలో పింఛన్ అందేవిధంగా ప్రభుత్వం నుంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెడ్‌క్రాస్‌కు 10అధునాతన పడకలను డాక్టర్ వీరమళ్ల చరణ్‌జిత్ రెడ్డి అందించారని అన్నారు. రెడ్ క్రాస్ సిబ్బందికి నివాస స్థలాల విషయంలో కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని అన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ.శ్రీనివాస్‌రావు, పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ శేషుమాధవ్ మాగంటి, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, చెన్నమనేని జయశ్రీ తదితరులు ఉన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు ఎల్‌ఐసీ వెన్నెముక


సమావేశాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసాచారి

- జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి

కాజీపేట అర్బన్: దేశ ఆర్థిక వ్యవస్థకు ఎల్‌ఐసీ వెన్నెముక వంటిదని ఎల్‌ఐసీ ఏజెంట్ల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్‌బీ.శ్రీనివసాచారి తెలిపారు. హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన లియాఫీ వరంగల్ డివిజన్ ఎల్‌ఐసీ ఏజెంట్ల విజ్ఞాన సదస్సుతో పాటు సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాసాచారి పాల్గొని మాట్లాడారు. ఎల్‌ఐసీ ప్రీమియంలో 85శాతం వాటా ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడిగా పెడుతున్నట్లు వివనిం,ఆనేజ పాలసీదారులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి గ్యారంటీగా ఉందని గుర్తుచేశారు. ఎల్‌ఐసీలో వచ్చిన మార్పులకు అనుగుణంగా ఏజెంట్లు టెక్నాలజీని పెంపొందించుకోవాలని సూచించారు. ఎల్‌ఐసీకి రూ.52 లక్షల కోట్ల ఆస్తులు, 14లక్షల మంది ఏజెంట్లు ఉన్నారని అన్నారు. మార్కెట్లో 28 ప్రైవేట్ కంపెనీలు ఉన్నా ఎల్‌ఐసీకి పోటీరావని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ డివిజన్ సీనియర్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, లియాఫీ సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు చింతల వెంకటరెడ్డి, బసవరాజు ప్రసాద్, రవిశంకర్, హైమావతి, మల్లారెడ్డి, పబ్బ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పూల రవీందర్



- సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెకు పలువురి మద్దతు

విద్యారణ్యపురి: తమను విద్యాశాఖలో విలీనం చేయాలని, అలాగే రెగ్యులరైజ్ చేసి మినిమం టైం పేస్కేల్ అమలు చేయాలని సమగ్రశిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఏకశిల పార్కువద్ద చేపట్టిన సమ్మెలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎండి.షఫి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొనికల శ్రీధర్‌గౌడ్ మాట్లాడారు. శిబిరాన్ని వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ సందర్శించి సంఘీభావం తెపారు. కార్యక్రమంలో బీసీటీఏ జిల్లా అధ్యక్షుడు తుమ్మ తిరుపతి, గౌరవ అధ్యక్షుడు భాస్కర్, సంజీవ తదితరులు పాల్గొన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామినేని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దార గణేష్, రాష్ట్ర కార్యదర్శి సందినేని వెంకటేశ్వర్ రావు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర భిక్షపతి, వరంగల్ జిల్లా పూర్వ అధ్యక్షుడు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తరెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, తదితరులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం దృష్టి సారించి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వాటి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

దత్తాత్రేయుడి జయంతి

కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయ ఆవరణలోని దత్తాత్రేయ, షిర్డి సాయి బాబా ఆలయాల్లో పండితులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్త జయంతి వేడుకలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లుశర్మ ప్రారంభించారు. భక్తులు సామూహికంగా దత్తాత్రేయ కవచం పఠించారు. టంటం దయాకర స్వామి ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు.

కాజీపేట రైల్వే ఆలయంలో..

కాజీపేట రూరల్: దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలను పురస్కరించుకొని కాజీపేట రైల్వే ఆలయ సముదాయంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాతో పాటు దత్తాత్రేయ ఫొటోలతో కాజీపేట జంక్షన్ మీదుగా కాజీపేట చౌరస్తా, పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో శేషసాయి, కిరణ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిక

న్యూశాయంపేట: పలు పార్టీలకు చెందిన ప్రజాసంఘాల నాయకులు ఏదునూరి వెంకట్రాజం, జుర్రు సంపత్‌కుమార్‌తో పాటు తదితరులు ఆదివారం సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హనుమకొండ జిల్లా కార్యదర్శి కే.భిక్షపతి, నేదునూరి జ్యోతి, ఏ.శ్రీనివాస్, ఎల్లేష్, తదితరులు ఉన్నారు.

అపార్ట్‌మెంట్ కమిటీ ఎన్నిక

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని ఆకృతి అవెన్యూ అపార్ట్‌మెంట్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరువరంగం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా యుగేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా జగదీశ్వర్‌రెడ్డి, సంపత్‌రావు, కోశాధికారిగా శ్యాంసుందర్ ఎన్నికయ్యారు.

డాక్టర్స్ కాలనీ -2 అభివృద్ధి కమిటీ ఎన్నిక

దేశాయిపేట: 12వ డివిజన్ డాక్టర్స్ కాలనీ -2 అభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీరాం చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీగా సింగరికొండ సంతోష్‌కుమార్, కోశాధికారిగా జనార్దన్, వరద వెంకటేశ్వరస్వామి టెంపుల్ అధ్యక్షుడిగా సింగరికొండ సురేష్‌కుమార్, జనరల్ సెక్రటరీగా కిషన్ రావు, కోశాధికారిగా ఎన్నికయ్యారు.

19న 'చలో హైదరాబాద్'

వరంగల్ అర్బన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు టి.ఉప్పలయ్య ఒక ప్రకటనలో కోరారు. కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, వారిని పర్మినెంట్ చేయాలని పేర్కొన్నారు.

ఉత్సవాలకు వెంకన్న ఆలయం ముస్తాబు


చైతన్యపురిలోని వెంకన్న ఆలయం

కాజీపేట: ధనుర్మాసోత్సవ వేడుకలకు చైతన్యపురి వెంకటేశ్వరస్వామి దేవాలయం అందంగా ముస్తాబైంది. సోమవారం నుంచి నెలరోజుల పాటు వెంకన్న ఆలయంలో నిత్య పూజలు జరిపించడానికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయానికి రంగులు వేయించి, విద్యుత్ దీపాల కాంతులతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. ఈనెల 29న తొండరప్పొడి అళ్వార్ తిరునక్షత్రోత్సవం, జనవరి 2న వెంకటేశ్వర స్వామికి శ్రవణ నక్షత్ర అభిషేకం, 10న ముక్కోటి ఏకాదశి వైకుంఠ దర్శనం, 11న కుడారై ఉత్సవం, గోదాదేవికి అభిషేకం, 13న గోదాదేవి కల్యాణోత్సవం, 14వ తేదీన ధనుర్మాస వ్రతం పూర్తి కావడంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, కెప్టెన్ వడ్డెపల్లి నరేందర్ వివరించారు.

వరంగల్ కోటలో పర్యాటకుల సందడి


శిల్పకళా సంపదను తిలకిస్తున్న పర్యాటకులు

ఖిలా వరంగల్: కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటకు ఆదివారం భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో మధ్యకోట శిల్పాల ప్రాంగణం, ఏకశిల చిల్డ్రన్స్ పార్కు సందర్శకులతో కిటకిటలాడుతూ సందడి నెలకొంది. ఈ సందర్భంగా కోటలోని స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శిల్ప సంపద, ఖుష్‌మహల్, రాతి మట్టికోట కట్టడాలు, ఏకశిల గుట్ట అందాలను తిలకించారు. గుండు చెరువులో బోట్ షికారు చేశారు. సాయంత్రం టీజీటీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాకతీయుల చరిత్ర, వీరనారి రాణి రుద్రమదేవి పోరాట పటిమను వివరించే సౌండ్, లైటింగ్ షోను కుటుంబ సమేతంగా తిలకించి సంతోషంగా వెనుదిరిగారు.

ఎంఐఎఫ్ కార్యక్రమాలు అభినందనీయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న షాయిద్ మసూద్

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ షాయిద్ మసూద్

న్యూశాయంపేట: వరంగల్ మైనార్టీ ఇంటలెక్చువల్ ఫోరం (ఎంఐఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు అభినందనీయమని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ షాయిద్ మసూద్ అన్నారు. వరంగల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 10వ మెగా ముస్లింల ఉచిత వివాహ పరిచయ వేదిక (మెగా దూ-బ-దూ) కార్యక్రమం ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్దిఖీ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా షాయిద్ మసూద్ మాట్లాడుతూ మధ్య దళారులు లేకుండా పేద, ధనిక యువతీ, యువకులకు ఉచితంగా వివాహ పరిచయ కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగిన విషయమన్నారు. అనీస్ సిద్దిఖీ మాట్లాడుతూ ఇప్పటివరకు పది మెగా దూబదూ కార్యక్రమాలు చేపట్టి సుమారు 468 జంటలకు వేదిక ద్వారా వివాహాలు జరిగాయని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఖలీం, కార్యవర్గ సభ్యులు డాక్టర్ రజామాలిక్, నాజీరీన్ వాహిది, మసూద్ మిర్జా, సయ్యద్ అక్బర్, అలంఖాన్, మాషుఖ్ రబ్బానీ, నుస్రత్, రుక్సానా పాల్గొన్నారు.

స్వయం సంఘాల సభ్యులకు యూనిఫాం


సమావేశమైన మహిళా సంఘం సభ్యులు (ఫైల్)

- ఏకరూప దుస్తులు అందించాలని ప్రభుత్వ నిర్ణయం

కాజీపేట: స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇక నుంచి ఏకరూప దుస్తులు (చీరలు) అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్థికంగా, సామాజికంగా తారతమ్య బేధాల్లేవు.. అందరూ ఐక్యంగా మెలగాలనేదే దీని ఉద్దేశం. సమాజంలోనూ సభ్యులకు ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనేదే ప్రభుత్వ ఆలోచన. గ్రామీణ, పట్టణాల్లోని స్వయం సహాయక సంఘంలో 10 నుంచి 15 మంది సభ్యులుంటారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకుని ఆహార పదార్థాల తయారీ, నాటుకోళ్లు, పుట్టగొడుగులు, పాల ఉత్పత్తులు, వ్యాపార దుకాణాలు, క్యాంటీన్ తదితర చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరకా ఇందిర మహిళా శక్తి యూనిట్లను మంజూరు చేస్తూ ప్రోత్సహిస్తోంది. వివిధ కార్యకలాపాల్లో రాణిస్తున్న సభ్యులు ఆర్థిక స్వావలంబన వైపు అడుగులేస్తున్నారు. ప్రతినెలా నిర్వహించే సంఘం సమావేశాల్లో వారు పాల్గొని ఆర్థిక ప్రగతిపై చర్చిస్తారు. వివిధ పనుల నిమిత్తం బ్యాంకులకు హాజరుకావడం, సమావేశాలకు వెళ్తుంటారు. ఆయా సందర్భాల్లో ఏకరూప దుస్తులు ధరిస్తే బాగుంటుందని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇది వారి సామాజిక గుర్తింపునకు చిహ్నమని భావిస్తోంది. జిల్లాలో ఎంత మంది సభ్యులు ఉన్నారనే కోణంలో మరోమారు వివరాలు సేకరించడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఘనంగా మడేలయ్య ఉత్సవాలు


సోమిడిలో మడేలయ్య ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తదితరులు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని మడేలయ్య ఉత్సవాలను రజక సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సీతాలమ్మ సమేత మడేలయ్య ఉత్సవాలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. రజక సంఘం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని రజక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, పి.ఆంజనేయులు, సుంచు కృష్ణ, ఎండీ.అంకూస్, పి.శివకుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓసిటీలో మహా పడిపూజ



వరంగల్: కాశిబుగ్గ ఓసిటీ రోడ్డు రాములవారి వీధిలోని సీతారామాంజనేయ దేవాలయ ఆవరణలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం మహాపడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్న ప్రసాద దాత క్యాతం రవీందర్, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూచన ఏకాంబరం, కార్యదర్శి దాసరి రాజేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.